
సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023

బొజ్జ గణపయ్యా.. మమ్మేలుకోవయ్యా



సిరిసిల్ల: హిమాన్షి ఆస్పత్రిలో కొలువుదీరిన తృణధాన్యాల వినాయకుడు



సిరిసిల్లటౌన్: అశోక్‌నగర్‌లో చిన్నారుల పూజలు



సిరిసిల్లటౌన్: గాంధీనగర్‌లో..



వేములవాడ: ఎములాడ రాజన్న సన్నిధిలో..



సిరిసిల్ల కల్చరల్: శాంతినగర్‌లో ..

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్/సిరిసిల్ల కల్చరల్/వేములవాడ: జిల్లాలో గణేశ్ నవరాత్రోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా చిన్నా, పెద్ద తేడాలేకుండా అన్నివర్గాల వారు వినాయకులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఒక సిరిసిల్ల పట్టణంలోనే సుమారు 900 వరకు వినాయక మండపాలు వెలిశాయి. 5 అడుగులు మొదలుకుని 18 అడుగుల ఎత్తు గల వినాయకులను ప్రతిష్ఠించారు. విభిన్నరూపాల్లో గణనాథులు కొలువుదీరడంతో సందర్శకులతో మంటపాలు సందడిగా మారాయి. సంజీవయ్యనగర్ హిమాన్షి పిల్లల ఆస్పత్రిలో తృణధాన్యాలతో తయారు చేసిన గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మిల్లెట్ ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసే లక్ష్యంతో ఐదు అడుగుల ఎత్తు గల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నవరాత్రుల సందర్భంగా మండపానికి వచ్చే భక్తులకు భక్తితోపాటు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాన్ని చూపించేందుకు ఈ మండపం స్ఫూర్తిగా నిలుస్తుంది. అలాగే వేములవాడ రాజన్న సన్నిధిలో గణేశ్ నవరాత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సంపద వనాలను సంరక్షించాలి



సంపదవనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గంభీరావుపేట(సిరిసిల్ల): గ్రామాల్లో వన సంపదను సృష్టించడానికి ఏర్పాటు చేసిన సంపద వనాలను సంరక్షించాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలోని ఎగువమానేరు ప్రాజెక్టు సమీపంలో ఏర్పాటు చేసిన సంపద వనాన్ని మంగళవారం పరిశీలించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పీడీ శ్రీనివాస్, అడిషనల్ పీడీ మదన్‌మోహన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అరుణ, సర్పంచ్ ఎడబోయిన రాజు ఉన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. సోమవారం ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులు, డీజే యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డీజేలతో సౌండ్ పొల్యూషన్ చేయరాదని, మండపాల వద్ద పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు మండపాలలోనే నిద్రించాలని, అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ ఎవరికి ఇబ్బందులు కలగకుండా అధికారులు సూచించిన చెరువులు, కుంటల్లో నిర్ణీత సమయంలో నిమజ్జనం చేయాలన్నారు. సీఐ సదన్ కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



మొక్క నాటుతున్న డీఐఈవో మోహన్

ముస్తాబాద్(సిరిసిల్ల): పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములై మొక్కలు నాటాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి చింతల మోహన్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపట్టిన హరిత హారంలో అందరూ పాల్గొని విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. ప్రిన్సిపాల్ సత్యనారా యణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పరశురా ములు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరెళ్ల గురుకులం సందర్శన

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను మంగళవారం డీఈవో రమేశ్‌కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన సిలబస్, ఇంటర్‌కి సంబంధించి ఎంసెట్, తదితర అంశాల గురించి సిబ్బందితో చర్చించారు. ప్రిన్సిపాల్ రాధ, పాఠశాల, కళాశాల సిబ్బంది ఉన్నారు.

లీడర్లకు మహిళా బిల్లు టెన్షన్!



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

మహిళా బిల్లు ప్రస్తావన ప్రకంపనలు రేపుతోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే మన రాష్ట్రంలో ఎమ్మెల్యే ఆశావహులను జమిలీ ప్రకటన వెంటాడుతుండగానే మహిళా బిల్లు వార్త గుండెలపై పిడుగుపాటులా పడింది. మహిళా బిల్లుకు పార్లమెంటు ఆమోదం లాంఛనమైన వేళ ఈ చర్చ స్థానికంగా దుమారం రేపుతోంది. బిల్లు ఇప్పటికిప్పుడు అమల్లోకి వస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ఏయే స్థానాలు రిజర్వేషన్ కిందకు వస్తాయి? అన్న లెక్కలు అప్పుడే మొదలయ్యాయి. అయితే, అదే సమయంలో మహిళా బిల్లును చూడకుండా అందులో పొందుపర్చిన అంశాలు అధ్యయనం చేయకుండా అప్పుడే నిర్ణయానికి రాలేమని సీనియర్ ఎమ్మెల్యేలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ నోట్ల రద్దు తరహాలో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు అమలు చేస్తే మాత్రం ఉమ్మడి జిల్లా రాజకీయాలపై పార్టీలకు అతీతంగా ప్రభావం చూపడం గ్యారెంటీ అని కుండబద్దలు కొడుతున్నారు. ఇది నియోజకవరాల పునర్విభజన తర్వాత ఉంటుందా? లేదా ఇప్పుడే అమలు చేస్తారా? అనే దానిపై స్పష్టత లేదు.

- ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలు రిజర్వేషన్?
- నేతల సతీమణులు, కోడళ్లను తెరపైకి తెచ్చే యోచన
- అన్ని పార్టీల్లో ఆశావహుల ఆశలపై నీళ్లు
- 1951 నుంచి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువే

పాత జిల్లా పరిస్థితి ఇదీ

ఉద్యమాల జిల్లాగా పేరొందిన పాత కరీంనగర్ జిల్లా ప్రజలు ఓటు రూపంలో తీర్పులు ఇవ్వడంలోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మొత్తం మూడు పార్లమెంటు, 13 అసెంబ్లీ స్థానాలు ఉన్న పాత జిల్లాలో మహిళా రిజర్వేషన్ ఇప్పటికప్పుడు అమలు చేయాల్సి వస్తే.. కనీసం నాలుగు సీట్లు కేటాయించాల్సి వస్తుంది. ఇప్పటికే మానకొండూరు, చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు స్థానాలు. వీటికి అదనంగా మరో నాలుగు సీట్లను జనాభా దామాషాన మహిళలకు కేటాయించాల్సి వస్తుంది. అంటే.. మూడు ఎస్సీ, నాలుగు మహిళలకు కేటాయిస్తే ఆరు జనరల్ స్థానాలు అవుతాయి. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ పార్టీ 13 మంది అసెంబ్లీ స్థానాలకు 13 మంది అభ్యర్థులు పురుషులనే ప్రకటించింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా ఇంకా ఖరారు కాలేదు. బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ నుంచి పోటీకి పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. మహిళా బిల్లు అనివార్యమైతే ఇప్పటికే బరిలో ఉన్న సిట్టింగ్‌లు, పోటీ చేయబోయే ఆశావహుల (దాదాపు 150 మంది)కు ఈ బిల్లును శరాఘాతంగా భావిస్తున్నారు.

1951 నుంచి తక్కువే..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కరీంనగర్ జిల్లా నుంచి మహిళా ప్రాతినిధ్యం తక్కువే అని చెప్పాలి. దీనికి సామాజికంగా, రాజకీయంగా అనేక కారణాలు ఉన్నాయి. హైదరాబాద్ రాష్ట్రంలో 1951లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి జేఎం రాజమణి దేవి (ఎస్‌సీఎఫ్) వేదికపై విజయం సాధించారు. తర్వాత 1972 నుస్తులాపూర్ నియోజకవర్గం నుంచి ప్రేమలతా దేవి (కాంగ్రెస్) విజయం సాధించారు. 1998లో విద్యాసాగర్‌రావు లోక్‌సభకు ఎన్నికవడంతో మెట్‌పల్లి అసెంబ్లీస్థానానికి రాజీనామా చేశారు. దీంతో కొమిరెడ్డి జ్యోతిదేవి (కాంగ్రెస్) మెట్‌పల్లి ఉపఎన్నికల్లో గెలిచారు. 1998, 1999 పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఎంపీగా డాక్టర్ సుగుణకుమారి రెండుసార్లు గెలిచారు. 2014లో చొప్పదండి నుంచి బొడిగె శోభ (టీఆర్‌ఎస్) ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం 33శాతం అమలు చేయాల్సి వస్తే ఈ లెక్కలన్నీ మారిపోతాయనడంలో సందేహం లేదు.

తెరపైకి సతీమణులు

మహిళా బిల్లు ఇప్పటికప్పుడు అమలు చేయాల్సి వచ్చినా.. మన నేతలు నిరుత్సాహపడినా.. పోటీకి వెనకడుగు వేయడం, నియోజకవర్గం మారడం వంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఒకవేళ మహిళా బిల్లు అమలు చేయాల్సి వస్తే తమ భార్యలు, కూతుళ్ల, కోడళ్లను రంగంలోకి దించాలని యోచిస్తున్నారు. మహిళా బిల్లు పార్టీలతో సంబంధం లేకుండా అమలు చేయాల్సిన అంశం కాబట్టి, దీని అమలు ప్రభావం అన్ని పార్టీల్లో ఉంటుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే తమ అభ్యర్థుల జాబితా ప్రకటించిన బీఆర్‌ఎస్ పార్టీ కూడా అభ్యర్థుల పేర్లు మార్చాల్సి రావొచ్చు. అలాగే, కాంగ్రెస్, బీజేపీలు కూడా బిల్లుకు అనుగుణంగా తమ జాబితాను రూపొందించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ పార్టీ నాయకుడైనా సరే తమకు కాకుంటే తమ ఇంట్లో ఆడవారికి ఇప్పించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. తిరిగి గెలిచేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఈసారైనా అధికారంలోకి రావాలని ప్రతిపక్ష పార్టీలు గత పదేళ్లుగా నియోజకవర్గాల్లో రూ.కోట్లాది ఖర్చు చేశారు. తీరా మహిళా బిల్లు వారికి శరాఘాతంగా మారినా.. అమలు అనివార్యమైతే దానిని తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో తలమునకలయ్యారు.

సార్లూ ఇది తగునా!

- హెచ్‌ఆర్‌ఏ కోసం స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం
- దంపతులిద్దరికీ వేర్వేరు స్థానాల్లో పోస్టింగులు
- స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లో చేరేందుకు అనాసక్తి
- నిబంధనలకు తూట్లు అని నాన్‌స్పౌజ్ టీచర్ల ఆందోళన
- పాయింట్ల విషయంలో విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: గవర్నమెంట్ హెడ్‌మాస్టర్(జీహెచ్‌ఎం) బదిలీల్లో అనేకవింతలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా స్పౌజ్(దంపతులు) పాయింట్ల విషయంలో భార్యాభర్తలిద్దరూ ఒకేచోట పనిచేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని, పాయింట్లు దుర్వినియోగానికి గురై దంపతులిద్దరూ వేర్వేరు చోట్ల పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవడం కలకలం రేపుతోంది. స్పౌజ్ కేటగిరీ కింద కేటాయించిన పాయింట్లు దుర్వినియోగమవుతున్నాయని నాన్ స్పౌజ్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం జిల్లా కేంద్రాల్లో ఉండాలని, అధిక హెచ్‌ఆర్‌ఏ వస్తుందని, కుటుంబ సభ్యులకు చేరువగా ఉంటామని, కాంప్లెక్స్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి రావడం, భార్య/ భర్త కింద పనిచేయడం ఇబ్బందిగా భావించడం తదితర కారణాలతో ఒకేచోట పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. కానీ, పాయింట్లను మాత్రం వాడుకుని తమకు నచ్చినచోటుకు బదిలీ అవుతున్నారు. వాస్తవానికి స్పౌజ్ కేటగిరీ పాయింట్లను దుర్వి నియోగం చేయకూడదని బదిలీలకు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల డీఈవోలు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. అయినా కొందరు జీహెచ్‌ఎంలు వీటిని బేఖా తరు చేస్తూ.. తమకు నచ్చినచోటుకు బదిలీ అయ్యారు.

మచ్చుకు కొన్ని..

- ఓ మహిళా జీహెచ్‌ఎం భర్త హన్మకొండ జిల్లా పరకాల మండలంలో పనిచేస్తున్నారు. కానీ, సదరు మహిళా జీహెచ్‌ఎం పరకాల మండలంలో నాలుగు ఖాళీలు ఉండగా వాటిని వదిలి పక్కనే ఉన్న హనుమకొండ మండలానికి బదిలీ అయ్యారు.
- కరీంనగర్ అర్బన్‌లో భర్త పనిచేస్తుండగా.. లేడీ జీహెచ్‌ఎం మాత్రం పక్కనే ఉన్న రుక్మాపూర్‌ను వదిలి హుజూరాబాద్ మండలానికి బదిలీ అయ్యారు.
- పెద్దపల్లి జిల్లాలో జీహెచ్‌ఎం జమ్మికుంటలోని తన భార్య వద్దకు కాకుండా.. శంకరపట్నం మండలం తాడికల్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశమైంది.
- పెద్దపల్లి జిల్లాలోని మరో జీహెచ్‌ఎం భార్య వీణవంక మండలంలో పనిచేస్తున్నారు. కానీ, ఈయన అదే మండలంలోని గంగారం స్కూల్‌ను కోరుకోకుండా, శంకరపట్నం మండలం కన్నాపూర్‌ను ఎంచుకున్నారు.
- జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో ఓ మహిళా జీహెచ్‌ఎం భర్త అదే మండలంలో పనిచేస్తున్నారు. సదరు జీహెచ్‌ఎం ఆ మండలాన్ని వదిలి స్పౌజ్ పాయింట్ల సాయంతో మేడిపల్లి మండలం దమ్మన్నపేట ఎంచుకున్నారు.
- సిరిసిల్ల జిల్లాకు చెందిన జీహెచ్‌ఎం చొప్పదండి మండలంలో తన భార్య పనిచేస్తున్న పాఠశాలలో ఖాళీ ఉండగా.. దాన్ని వదులుకుని పక్క పాఠశాలకు బదిలీ అయ్యారు.

దరఖాస్తులో లేకున్నా.. ఆర్డర్‌లో ప్రత్యక్షం..

జమ్మికుంట మండలంలోని ఓ మహిళా జీహెచ్‌ఎం బదిలీ దరఖాస్తులో స్పౌజ్ పాయింట్లు వినియోగించుకోవడం లేదని ధ్రువీకరించింది. కానీ, బదిలీ ఆర్డర్‌లో మాత్రం స్పౌజ్ కేటగిరీలో 10 పాయింట్లు వినియోగించుకున్నట్లు చూపిస్తోంది. దీనివెనుక డీఈవో కార్యాలయ సిబ్బంది హస్తం ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

మంచినీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామంలో మంచినీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. గ్రామంలో బోరుమోటార్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పేరు చెబుతున్నప్పటికీ అవి కూడా నెలరోజులుగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చెత్త సేకరణ ప్రక్రియ చేపట్టడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎంపీడీవో శ్రీనివాస్ సంఘటన స్థలానికి వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. మహిళల ఆందోళనకు నాయకులు కృష్ణకాంత్‌యాదవ్, నాగరాజుగౌడ్, శివంది దేవేందర్, ఎల్లం, అక్బర్‌ఖాన్, తిరుపతి, రాజారమేశ్, శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి.. కాంగ్రెస్ బాధ్యత

- ఏఐసీసీ ప్రతినిధి ప్రీతంసింగ్

సిరిసిల్లటౌన్: తెలంగాణ ప్రగతి కోసం.. ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు కాంగ్రెస్ బాధ్యత తీసుకుందని ఏఐసీసీ ప్రతినిధి ప్రీతంసింగ్ అన్నారు. సోనియాగాంధీ విజయభేరి సభలో వెల్లడించిన ఆరు గ్యారంటీ పథకాలను సిరిసిల్ల పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. స్థానిక బీవైనగర్ తదితర కార్మికవాడల్లో గడపగడపకూ ప్రచారం చేపట్టగా.. ప్రీతం సింగ్ ప్రజలతో నేరుగా మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతినెలా రూ.2,500, రైతులు, కౌలు రైతులకు ఏటా రూ. 15వేలు పెట్టుబడి, ప్రతికుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటుతో గృహజ్యోతి అందిస్తామన్నారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ పథకం ద్వారా నివేశన స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డులు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్, సామాజిన పింఛన్లు నెలకు రూ.4వేలు, రాజీవ్ ఆరోగ్య బీమాను రూ.10లక్షల వరకు అందిస్తామన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాల ప్రచార పోస్టర్లు విడుదలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే. మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, చీటి ఉమేశ్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, సూర దేవరాజు, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ గ్యారంటీ పథకాలపై సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న ప్రీతంసింగ్, నాయకులు

అధికార పార్టీ కౌన్సిలర్ నిరసన గళం

- డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులపై ఆందోళన

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ మున్సిపల్ ఆఫీస్ ఎదుట బైఠాయించి నిరసన గళాన్ని వినిపించారు. సిరిసిల్ల పట్టణ శివారు రాజీవ్‌నగర్ (11వ వార్డు)కు 31 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, 26 మందికి ఇళ్లను కేటాయించి, మరో ఐదుగురికి అన్యాయం చేశారని కౌన్సిలర్ ఒగ్గు ఉమా రాజేశం ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేమని మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చక్రపాణిని అడిగితే.. సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. అనర్హులైన మరో ఐదుగురికి ఆ ఇళ్లను కేటాయించారని, అర్హుల జాబితాలో లేనివారికి, లక్కీ లాటరీలో పేర్లు లేనివారికి ఇచ్చారని పేర్కొన్నారు. తన వార్డుకు నెల రోజులుగా చెత్త బండి కూడా రావడం లేదని, ఇదేమని అడిగితే మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని ఉమా రాజేశం ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ తీరుకు నిరసన మున్సిపల్ మహిళా కౌన్సిలర్ తన భర్తతో కలిసి బైఠాయించడం చర్చనీయాంశమైంది.

మంత్రి హామీ ఇచ్చినా దక్కని ఇల్లు

తమ కొడుకు కొంగర రాకేశ్ 2021లో మానేరు వాగులో పడి మరణించాడు. రాజీవ్‌నగర్‌లోని తమ ఇంటికి పరామర్శకు వచ్చిన మంత్రి కేటీఆర్ డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని, అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని కొంగర నిర్మల, వీరేశం దంపతులు తెలిపారు. తమ పేరిట సారంపల్లి వద్ద 75 గజాల ప్రభుత్వ స్థలం పట్టా ఉందనే కారణంగా డబుల్ బెడ్రూం ఇల్లు ఎంపికకు అనర్హులను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పట్టా భూమిని స రెండర్ చేస్తామని కూడా చెప్పామని, అయినా తమకు ఇల్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని కన్నీరుపెట్టారు. తమకు డబుల్ బె డ్రూం ఇల్లు కేటాయించాలని కోరారు. రాజీవ్‌నగర్‌కు చెందిన అధికార పార్టీ కౌన్సిలర్, నేత కార్మిక కుటుంబానికి చెందిన బాధితులు మున్సిపల్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసన తెలియజేయడం చర్చనీయాంశమైంది. తోటి మున్సిపల్ కౌన్సిలర్లు సముదాయించి ఒగ్గు ఉమా రాజేశం ఆందోళనను విరమింపజేశారు.



సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ ఎదుట బైఠాయించిన కౌన్సిలర్ ఒగ్గు ఉమా, రాజేశం, వీరేశం, నిర్మల

క్లుప్తంగా

యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా 'పొన్నం'


పొన్నం మధు

బోయినపల్లి(చొప్పదండి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పొన్నం మధును నియమించినట్లు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ బీవీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ బీవీ, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, తెలంగాణ ఇన్చార్జి కలీద్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాజిద్‌కు మధు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు చేపడుతున్న 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని ప్రతివారం నిర్వహిస్తున్నటు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ 554, బ్రెస్ట్ 575, ఓరల్ కావిటీ 583 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 14, ల్యాబ్ 76, థైరాయిడ్ 50, విటమిన్ డీ 52, సీబీపీ 66, సూక్ష్మ పోషకాలు 50 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో ఏడుగురిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన సెల్‌ఫోన్ దొంగలు

సిరిసిల్లక్రైం: వినాయక చవితి పర్వదినాన ప్రజలు నిత్యవసరాలకు మార్కెట్ రావడాన్ని అదునుగా భావించి సెల్‌ఫోన్స్ దొంగలించేందుకు వచ్చిన ముఠాలోని ముగ్గురిని సిరిసిల్ల టౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. జిల్లాతోపాటు పరిసర ప్రాంతాల్లో ఇలాంటి చిల్లర దొంగలు తిరుగుతున్నట్లు పట్టుబడినవారి మాటల ఆధారంగా గుర్తించామని ఘటన ప్రాంతంలోని పోలీసులు పేర్కొన్నారు. వీరి ముఠా వివరాలను తెలుసుకునేందుకు ఇంకా దర్యాప్తు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు చోరీ



వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట గ్రామ ఎల్లమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు తీగల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి పోలీస్ సిబ్బంది అంజయ్య, అశోక్ చేరుకుని వివరాలు సేకరించారు. లైట్లతో పాటు సామగ్రి ఎత్తుకుపోవడంతో దాదాపు రూ.20 వేల వరకు నష్టం జరిగినట్లు గుర్తించారు. కాగా ఇటీవల ప్రధానంగా చిన్న ఆలయాలపై చిల్లర దొంగతనాలు పెరిగిపోతున్నాయి. గ్రామాల శివారుల్లోని ఆలయాలపై దృష్టి పెడుతున్న దొంగలు అందులోని హుండీలు, నగలు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్తున్నారు. గతంలో వేములవాడ మండలం కోనాయపల్లి ఎల్లమ్మ ఆలయంలో రెండుసార్లు దొంగతనాలు జరిగాయి. సోమవారం హన్మాజిపేట ఎల్లమ్మ ఆలయంలో చిల్లర సామగ్రి తో పాటు హైమాస్ట్ లైట్లను కూడా ఎత్తుకెళ్లారు. ప్రధాన కూడళ్లు, ఆలయాలు, గ్రామాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ పదే పదే చెబుతుండగా, కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నా చిల్లర దొంగతనాలు ఆగడం లేదు. రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంతోనే చోరీలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అన్నలకే 'పెద్దన్న'.. నిజాం వెంకటేశం..!

- మావోయిస్టు అగ్రనేతలకు ఆత్మీయుడు
- 'నిజాం' ఇంట్లోనే తొలినాటి ఉద్యమ సమావేశాలు
- మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ వ్యాసంతో వెల్లడి
- సిరిసిల్ల నుంచి పెద్దపల్లి వయా జగిత్యాల..
- నిజాం వెంకటేశంపై పుస్తకాన్ని వెలువరించిన సాహితీమిత్రులు


వెంకటేశం పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీమిత్రులు, కుటుంబ సభ్యులు(ఫైల్)


పెద్దపల్లిలో వెంకటేశం నివసించిన క్వార్టర్

సిరిసిల్ల: మావోయిస్టు అగ్రనేతలకు ఆత్మీయుడు నిజాం వెంకటేశం. ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని మావోయిస్టు అగ్రనేతలు ఆయన మరణించే దాకా బయటపెట్టలేదు. సిరిసిల్ల పట్టణానికి చెందిన నిజాం వెంకటేశం (74) గతేడాది సెప్టెంబరు 18న హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించాడు. ఆయన మరణించిన విషయం తెలిసి..సరిగ్గా పది రోజులకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ ఓ వ్యాసం రాశారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు అగ్రనేత మల్లోజుల రాసిన వ్యాసం ఏడాది కిందట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చర్చనీయాంశమైంది. ఎవరీ నిజాం వెంకటేశం.. ఏమిటీ ఆయన చరిత్ర అని ఆరా తీశారు. ఆయన మరణించిన ఏడాది పూర్తి అయిన సందర్భంగా 'అన్నలకే పెద్ద న్న' అయిన నిజాం వెంకటేశం అడుగుజాడలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఎవరీ నిజాం వెంకటేశం..

కల్లోల సిరిసిల్లలో 1948 నవంబరు 14న వైశ్య కుటుంబంలో పుట్టి పెరిగిన నిజాం వెంకటేశం ట్రాన్స్‌కో ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించారు. ఆయన మూలాలు పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఉన్నాయని తెలుసుకున్న పలువురు సాహితీవేత్తలు ఉద్వేగానికి గురయ్యారు. సమసమాజ స్థాపనకు జరుగుతున్న ప్రజా యుద్ధంలో తన వంతు శక్తికి మించి సాయాన్ని అందించారని నిజాం వెంకటేశం నిజాల గురించి మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రాసిన వ్యాసంతో వెల్లడైంది. పెద్దపల్లిలోని తన చిన్ననాటి మిత్రులు ఒకసారి పాత జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. 'అవును వెంకటేశం సార్ ఇక్కడే ఉండేవారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన తర్వాత తిరిగి పెద్దపెల్లికి రాలేదు' అంటూ 42 ఏళ్ల క్రితం తనతో ఉన్న అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకుంటున్నారు. ఐదారేళ్ల పెద్దపల్లిలోనే ఉద్యోగం చేశారు. కరెంటు పవర్ హౌస్ (రాఘవపూర్ సబ్ స్టేషన్) లో ఉద్యోగం చేస్తూ ఓ సాహితీవేత్తగా విప్లవానికి అందించాల్సిన సేవలు అందించారు. ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూనే.. గుట్టలు సమీపంలో ఉండడంతో పెద్దపల్లిలో ఐటీఐ చదివే వారు, విప్లవకారులు ఆయన ఇంటిని షెల్టర్‌గా చేసుకున్నారు. కుటుంబ సభ్యులు కూడా వారికి భోజనం పెట్టి ఆత్మీయంగా ఉండేవారని మల్లోజుల తన వ్యాసంలో వెల్లడించారు. తన కంటే ముందు తన సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావుకు వెంకటేశం అత్యంత సన్నిహితుడని వివరించారు. తనను సైకిల్‌పై కూర్చోబెట్టుకుని డబుల్ సవారీ చేస్తూ తనకు ప్రపంచాన్ని పరిచయం చేశాడని వేణుగోపాల్ చెప్పడం విశేషం.


నిజాం వెంకటేశం(ఫైల్)

అగ్రనేతలకు ఆత్మీయుడు..

పశ్చిమబెంగాల్‌లో అమరుడైన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ మొదలుకొని ఇప్పటికీ సజీవంగా కేంద్ర కమిటీలో ఉన్న గణపతి అలియాస్ ముప్పాళ లక్ష్మణ్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన కదారి సత్యనారాయణరెడ్డి (కోసా), మంథనికి చెందిన మల్లా రాజిరెడ్డి, ప్రభుత్వంతో శాంతి చర్చల ప్రతినిధి గణేష్ ఇలా.. ఓ పదిపదిహేను మంది మావోయిస్ట్ అగ్రనేతలకు నిజాం వెంకటేశం సార్ ఇల్లు ప్రధాన షెల్టర్ అని రాఘవపూర్ గ్రామస్తులు తెలిపారు. వామ్మో సార్ ఇంటికి అప్పట్లో పెద్ద పెద్దోళ్లు (పెద్దన్నలు) వచ్చేవారని అంటున్నారు. ఇక ఉత్తర తెలంగాణ కార్యదర్శి సాగర్ అలియాస్ దుగ్గ రాజ లింగం ప్రభుత్వ ఉద్యోగం చేసేవాడు. రాజలింగంకు నిజాం వెంకటేశం అత్యంత సన్నిహితుడిగా మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. నిజాం వెంకటేశం విప్లవ కార్యాచరణకు అందించిన సహకారాన్ని వివరిస్తూ రాసిన లేఖ పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల్లో ఒక సంచలనం రేపింది. విప్లవ ఉద్యమానికి ఆయన నిర్వర్తించిన పాత్ర అనిర్వచనమని మల్లోజుల పేర్కొన్నారు. ఆశ్రయం కల్పించడం, సాహిత్యాన్ని అందించడం, వచ్చినవారిని కడుపులో దాచుకోవడం, ఉద్యమంలో పాల్గొన్న వారిని, వారి ఆర్థిక అవసరాలను తీర్చి, ప్రోత్సహించేవారిని నాటి వెంకటేశం మిత్రులు పేర్కొంటున్నారు. ఇలా ఉద్యమానికి అక్షరమై, ఆయుధాన్ని అందించిన వెంకటేశం సిరిసిల్ల ప్రాంత వాసి కావడం విశేషం. నిజానికి నిజాం వెంకటేశం గురించి సిరిసిల్ల ప్రాంత వాసులకు చాలా తక్కువే తెలుసు కానీ, ఆయనతో సన్నిహితంగా ఉండే వారికి అపర మేధావి, ధైర్యవంతుడు, పెద్ద యుద్ధానికి అగ్రనేతలను సంసిద్ధులను చేసిన పెద్దన్నగా పేరు సంపాదించినట్లు తెలిసింది.

హైదరాబాద్‌లో స్థిరపడి..

సిరిసిల్లకు చెందిన నిజాం విశ్వనాథం, సత్తమ్మ దంపతుల కొడుకు వెంకటేశం. భార్య పేరు మాధవి. ఒక్క కొడుకు, ఇద్దరు కూతుర్లు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 1966లో పాలిటెక్నిక్ చేసిన వెంకటేశం, చదువు పూర్తికాగానే 1968లో తొలిసారి ట్రాన్స్‌కోలో ఉద్యోగిగా జగిత్యాలలో విధుల్లో చేరారు. 1972 నుంచి 1978 వరకు పెద్దపల్లిలో పని చేశారు. అనంతరం 1978 నుంచి 1990 వరకు జగిత్యాల ప్రాంతంలో పని చేశారు. 1997లో ఉద్యోగ విరమణ చేశారు. ఇంగ్లిష్‌పై పట్టున్న ఆయన అనేక పుస్తకాలను తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి, ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. సిరిసిల్ల శివారులోని రంగినేని ట్రస్ట్‌లో జరిగే సాహిత్య వేడుకలకు ఆయన తరచూ వచ్చేవారు. సిరిసిల్లలో అనేక మంది కవులు, సాహిత్యకారులు నిజాం వెంకటేశం సన్నిహితులుగా ఉన్నారు. కవిగా, విమర్శకులుగా పలు సాహిత్యకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'అజాత శత్రువు'గా పుస్తకం

వెంకటేశం సాహిత్యం.. వ్యక్తిత్వాన్ని 'అజాత శత్రువు నిజాం వెంకటేశం' పేరుతో పుస్తకాన్ని వెలువరించారు. తెలంగాణ జిల్లాలోని ప్రముఖ రచయితలు, కవులు, సాహిత్యకారులు ఈ పుస్తకంలో ఆయనతో ఉన్న అనుబంధాలను రాశారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు వచ్చినా ఆయన ఎదుటివారికి సాయం చేయడంలో ఏ మాత్రం వెనక్కి తగ్గేవారు కాదు. తన సంపాదనలో ఎక్కువగా పుస్తకాల కొనుగోలుకు వెచ్చించినట్లు పలువురు తమ వ్యాసాల్లో వెల్లడించడం విశేషం. తను మరణించిన ఏడాది పూర్తి అయిన సందర్భంగా సిరిసిల్ల ప్రాంతంలోని సాహిత్యకారులు ఆయన సేవలను యాది చేసుకున్నారు.

సాహిత్యాభిలాష పెంచేందుకే కార్యశాల

సిరిసిల్లకల్చరల్: విద్యార్థుల్లో సాహిత్యాభిలాషను పెంచేందుకు ఈ నెల 30న కథా కార్యశాల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు. భాషాభిరుచిని కొత్తతరంలో పాదుకొల్పేందుకు 2016 నుంచి ఏటా ఈ తరహా కార్యశాలల్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని వివరించారు. రేగులపాటి లక్ష్మి పిల్ల ల పండుగ పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అభిరుచి గల విద్యార్థులు పాఠశాలకు పది మంది చొప్పున పంపించాలని కోరారు. రంగినేని ట్రస్టులో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగే కార్యశాలలో పాఠ్యాంశాల్లో భాగమైన సృజనాత్మక రచనపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రశంసాపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీలోపు ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను 98496 49101 నంబర్‌కు పంపించాలని సూచించారు.

వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరికి జైలు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: : వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరికి సిరిసిల్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ఆగస్టు 4న సిరిసిల్లకు చెందిన అన్నల్‌దాస్ రమేశ్ అనే వ్యక్తి ఇనుప సామగ్రి అమ్మగా వచ్చిన రూ.10వేలను ఆటోలో పెట్టి మార్కెట్‌లో కిరాణషాపునకు వెళ్లి రాగా డబ్బులు చోరీకి గురయ్యాయి. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపల్లికి చెందిన సందు సాయిలును దొంగగా గుర్తించి అరెస్టు చేసి కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టగా.. మున్సిఫ్ కోర్టు జడ్జి హిమబిందు నిందితుడికి ఏడాది జైలు, రూ.200 జరిమానా విధించారు. మరో కేసులో ఎల్లారెడ్డిపేటకు చెందిన పెద్దవేని భాస్కర్ మే 31న అక్కడి బస్టాండులో పార్కింగ్ చేసిన తన బైక్ చోరీకి గురైనట్లు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై లావుడ్య శ్రీకాంత్ విచారణ చేపట్టి హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన సద్ద చింటును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి 8నెలలు జైలు శిక్షను మెజిస్ట్రేట్ హిమబిందు ఖరారు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ ప్రకటించారు.

ఆందోళనలు.. సమ్మె నోటీసులు

- అంగన్‌వాడీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసనలు


అంగన్‌వాడీ దీక్షా శిబిరంలో వినాయకుడికి పూజలతో నిరసన

సిరిసిల్లటౌన్: పండుగ పూట జిల్లా కేంద్రం నిరసనలతో హోరెత్తింది. సమగ్ర శిక్ష, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్ల ట్రేడ్ యూనియన్ల రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వందలాది ఐసీడీఎస్ కార్యకర్తలు దీక్షల శిబిరంలో వినాయకుడికి పూజలు, భజనలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేలా చూడాలని వేడుకున్నారు. ప్రభుత్వం తమతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. తమ సమస్యలను నినదిస్తూ ప్రధాన రోడ్లవెంట ప్రదర్శన జరిపారు. జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్లూరి చందన, పధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కదారి రాములు తదితరులు సంఘీభావం పలికారు.

పర్మినెంట్ చేయాలి..

తమ ఉద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక కొండా లక్ష్మణ్ బాపూజి చౌరస్తా నుంచి ఎమ్మెల్యే ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తమ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. ఈమేరకు కేటీఆర్ క్యాంపు ఆఫీసులో వినతిపత్రాన్ని అందించారు. జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, జయలక్ష్మి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరిస్తలేరు.. సమ్మెకు పోతున్నం..

ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆశావర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు సమ్మె నోటీస్‌ను డీఎంహెచ్‌వో ఆఫీసులో అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా ఆశావర్కర్లు వెట్టి చాకిరికి గురైతుంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించి బెనిఫిట్స్ అందించాలని కోరారు. సీఐటీయూ అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆశావర్కర్స్ జయశీల, చంద్రకళ, కస్తూరి, రేణుక, రుచిత, లావణ్య, స్వప్న, మమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల తిప్పలు తప్పించాలే..

ఇన్నేళ్లుగా తాము పడుతున్న అప్పుల తిప్పలను ఇకనైనా సర్కారు తప్పించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. ఎన్నిసార్లు మొరపెట్టినా సర్కారు స్పందించడం లేదంటూ మంగళవారం డీఈవో ఆఫీసులో కార్మికులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం మెస్ చార్జీలు తక్కువగా ఇస్తున్నందున చాలా ఏళ్లుగా అప్పులతో నెట్టుకొస్తున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు వెల్లడించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ తదితరులున్నారు.

కలిసి తాగారు.. గొంతునులిమి చంపారు

- తిప్పాపూర్ హత్య కేసులో ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేంద్రచారి


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

వేములవాడ: రెండేళ్లుగా కలిసి పని చేస్తున్నారు.. కలిసే మద్యం సేవించారు.. చిన్నపాటి గొడవతో మద్యం మత్తులో దోస్త్ అని చూడకుండానే గొంతు నులిమి చంపేశారు. తిప్పాపూర్‌లో ఇటీవల జరిగిన చందనపు శ్రీనివాస్ హత్య కేసులో ఇద్దరు నిందితులు జావిద్, జాఫర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి చెందిన జావిద్, జాఫర్‌లు శ్రీనివాస్‌తో కలిసి రెండేళ్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో తిప్పాపూర్‌లో దావత్ చేసుకున్నారు. మద్యం మత్తులోకి వెళ్లిన తర్వాత చిన్నపాటి గొడవతో శ్రీనివాస్‌ను జావిద్, జాఫర్ గొంతు పిసికి చంపారు. ముందుగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నామని, ప్రజలిచ్చిన సమాచారం మేరకు టౌన్ సీఐ కరుణాకర్, సిబ్బంది శ్రీనివాస్‌రావు, గోపాల్ దర్యాప్తు చేపట్టి అనతికాలంలోనే నిందితులను పట్టుకున్నారని డీఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా సీఐ, సిబ్బందిని అభినందించారు. గ్లోబలైజేషన్ ద్వారా మార్బల్ వర్క్, పాలిష్, సుతారి, జేసీబీ డ్రైవింగ్, సెంట్రింగ్, పేయింటింగ్ తదితర పనులకు ఇతర రాష్ట్రాల నుంచి లేబర్ వస్తున్నారని, ఇలాంటి వారితో స్నేహం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ పేర్కొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

- భూ వివాదాలే కారణమా..?
- నిందితుల కోసం పోలీసుల గాలింపు


లింగయ్య (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి, కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మేకల లింగయ్య సోమవారం రాత్రి దారుణహత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. లింగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని సమస్యాత్మక భూములను కొంటూ.. వాటిని పరిష్కరించి.. విక్రయాలు చేస్తున్నారు. గ్రామంలోని ఓ భూమి విషయంలో లింగయ్యకు.. మరికొందరికి వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో లింగయ్య రాత్రి సుమారు 8 గంటల సమయంలో పెంపుడు కుక్కతో ప్రధాన రహదారి నుంచి పవర్‌ప్లాంట్‌కు వెళ్లే దారిలో వాకింగ్ చేస్తున్నారు. అప్పటికే మాటువేసిన దుండగులు లింగయ్యపై వేట కొడవళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎన్టీపీసీ ఎస్సై జీవన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కృష్ణాష్టమి రోజే హత్యకు ప్లాన్..?

లింగయ్యను హత్య చేసేందుకు నిందితులు కృష్ణాష్టమి రోజే ప్రయత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. అనంతరం వినాయక చవితి పండుగపూట రోడ్లపై ఎవరూ ఉండరని, హత్యకు అదే అనువైన సమయమని దుండగులు భావించినట్లు సమాచారం. సుమారు 12 రోజులపాటు గస్తీ నిర్వహించి.. వాకింగ్‌కు వెళ్లే సమయం అనుకూలమని నిందితులు నిర్ధారించుకుని పక్కా ప్లాన్ ప్రకారమే రాత్రి సమయంలో లింగయ్య వాకింగ్ చేస్తుండగా.. వేట కొడవళ్లతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.

నాడు అన్న.. నేడు తమ్ముడు

ఖాజీపల్లికి చెందిన మేకల లింగయ్యతో కలిపి ఐదుగురు అన్నదమ్ములు. లింగయ్య అన్న రాజయ్య 1991 ఏప్రిల్ 4న పొలం పనులకు వెళ్లి ఇంటికొస్తుండగా ఇంటి సమీపంలోనే ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. కుటుంబంలో చిన్నవాడైన మేకల లింగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తాజాగా అతడి హత్య జరిగిన 32 ఏళ్ల తర్వాత లింగయ్యను కూడా అలాగే హతమార్చడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

పోలీస్ పహారా మధ్య ఖాజీపల్లి

లింగయ్య హత్యలో ఓ అనుమానితుడి ఇంటి ప్రహరీని మృతుడి కుటుంబసభ్యులు కూల్చివేశారు. దీంతో ఖాజీపల్లిలో పోలీసులు భారీగా మోహరించారు. లింగయ్య అంత్యక్రియల సమయంలోనూ గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారా కొనసాగించారు. డాగ్‌స్క్వాడ్‌తో దర్యాప్తు చేస్తున్నారు. భూ వివాదాలే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధితుడి కూతురు మేకల సుప్రజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుల కోసం ప్రత్యేక బలగాలు గాలింపు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో వెటర్నరీ డాక్టర్ దుర్మరణం

- పోతుగల్‌లో విషాదం


దినేశ్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన వెటర్నరీ డాక్టర్ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. పోతుగల్‌కు చెందిన గాలిగాని దినేశ్(31) హైదరాబాద్‌లోని ఓ పశు వైద్యశాలలో కాంట్రాక్టు వైద్యుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. దినేశ్ మృతి సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇటీవలే స్వగ్రామానికి వచ్చి వెళ్లిన దినేశ్ ఆక్సిడెంట్‌లో మృతిచెందాడనే విషయం గ్రామస్తులను కలచివేసింది. మృతుడికి భార్య, ఏడాది వయస్సుగల కుమార్తె ఉంది. ఎంతో భవిష్యత్ ఉన్న దినేశ్ అర్ధంతరంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రమేశ్ (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి నందికమాన్ వద్ద బోదాసు రమేశ్ (30)ను ద్విచక్ర వాహనం ఢీకొనగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ గ్రామానికి చెందిన రమేశ్ మూడేళ్లుగా తన చెల్లెలు నాంపల్లికి చెందిన కనకలక్ష్మి వద్ద కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి కమాన్‌వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న రమేశ్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. స్థానికులు 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముస్తాబాద్ మండలం గూడెంలో మరొకరు..


చందు (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): అప్పుల బాధలు భరించలేక ఓ యువకుడు పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం మేరకు.. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన ఈడుగురాళ్ల చందు(36) రెండు రోజుల క్రితం జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. చందు తన చెల్లెళ్ల పెండ్లిళ్లకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక.. మరోవైపు ఇంట్లో కలహాలు భరించలేక పురుగుల మందు తాగాడు. మృతుడికి తల్లిదండ్రులు రామచంద్రం, లక్ష్మి, భార్య ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

స్కూల్ బయోమెట్రిక్‌కు మంగళం

సిరిసిల్లఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదుకు విద్యాశాఖ తీసుకువచ్చిన బయోమెట్రిక్ పరికరాలను వెనక్కి పంపాలని రాష్ట్ర విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు వెల్లడించింది. జిల్లాలోని 333 ప్రాథమిక, 110 ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదు బయోమెట్రిక్ విధానం రెండేళ్లుగా అమలు చేశారు. దీనిని వెంటనే రద్దు చేయాలని వచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయుల్లో చర్చ జరుగుతోంది. అసలు బయోమెట్రిక్ రెండేళ్ల నడిచిందేకానీ దానిని పర్యవేక్షించిన నాథుడే లేడని, పర్యవేక్షణ లేకుండా పరికరాలెన్ని తెచ్చినా వాటితో ఉపయోగం లేదని ఉపాధ్యాయ సంఘం నాయకులు వాపోయారు.



శరణు శరణు రాజన్న

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వినాయక చవితి సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్టీవోలో చేతివాటం..?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): దాదాపు నెలరోజులపాటు నిరవధిక సమ్మె చేసి ప్రభుత్వాన్ని ఒప్పించి, అధికారులను మెప్పించి కష్టపడి రెగ్యులర్ సాధించుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కష్టాలు ఇంకా తీరడం లేదు. జిల్లాలో ఇటీవల మొదటి విడతలో సుమారు 90 మంది వరకు జేపీఎస్‌లు రెగ్యులర్ అయ్యి గ్రేడ్-4 సెక్రెటరీలుగా ప్రమోట్ అయినట్లు ప్రొసీడింగ్ కాపీలు పొందారు. కానీ బేసిక్ పే చెల్లింపు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. రెగ్యులర్ అయిన గ్రేడ్-4 సెక్రెటరీలకు బేసిక్ పే ప్రకారం జీతాలను ఎస్టీవో నుంచి చెల్లించాల్సి ఉండగా వారికి కొత్తగా ప్రాన్‌నంబర్ తోపాటు ఎంప్లాయ్‌కోడ్ కేటాయించాల్సి ఉంది. అయితే ఇక్కడే కొందరు ఎస్టీవోలో పనిచేసే ఉద్యోగులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రాన్ నంబర్, ఎంప్లాయ్ కోడు కేటాయించేందుకు వసూళ్లకు తెరలేపారు. ఒక్కో కార్యదర్శి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా మండలాల వారీగా ఎంపీడీవో కార్యాలయాల్లోనే వసూల్ చేసి ఇవ్వాలని హుకూం జారీ చేసినట్లు సమాచారం. నాలుగేళ్లు అహర్నిషలు శ్రమించి గ్రామాలను తీర్చిదిద్ది చెమటోడ్చిన తమ వద్ద రెగ్యులర్ పేరుతో డబ్బుల వసూల్ చేయడం అన్యాయమని కొత్తగా రెగ్యులర్ అయిన కార్యదర్శులు వాపోతున్నారు. ఈ విషయంపై జిల్లా ట్రెజరి అధికారి నీరజను 'సాక్షి' వివరణ కోరగా.. డబ్బు వసూళ్లు అవాస్తవమని ఖండించారు. ఇప్పటికే ఎంప్లాయి కోడ్‌లను కేటాయిస్తున్నామని వివరించారు.